


Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 180 | శుక్రవారం 19 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఉపాధి హామీ చట్టం రద్దు..

- కొత్త బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త బిల్లు
- 'వీబీ జీ రామ్ జీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- విపక్షాల తీవ్ర నిరసనల మధ్య మూజువాణి ఓటుతో ఆమోదం

2లో



## ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం...

- 29వ అంతర్జాతీయ గౌరవం
- 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను ప్రదానం చేసిన సుల్తాన్
- రెండు రోజుల క్రితం ఇథియోపియా నుంచి కూడా అత్యున్నత గౌరవం
- భారత్-ఒమన్ మధ్య కీలక సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం
- ఇరు దేశాల 70 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా ఈ పర్యటన

2లో



## రష్యా సైన్యంలో 202 మంది భారతీయులు...

- 26 మంది మృతి: కేంద్రం
- ఇప్పటివరకు 119 మందిని సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చినట్టు వెల్లడి
- మరో 50 మంది విడుదల కోసం రష్యాతో చర్చలు జరుపుతున్నట్టు ప్రకటన
- మరణించిన వారిలో 10 మంది మృతదేహాలను స్వదేశానికి తరలింపు
- మృతుల గుర్తింపు కోసం 18 కుటుంబాల డీఎన్ఏ శాంపిళ్లు రష్యాకు పంపినట్టు వెల్లడి

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, డిసెంబర్ 18



రష్యా సైన్యంలో 2022 నుంచి ఇప్పటివరకు 202 మంది భారతీయులు చేరారని, వారిలో 26 మంది మరణించగా, మరో ఏడుగురు గల్లంతయ్యారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇవాళ రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే, కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ వివరాలు తెలిపారు. భారత్ చేపట్టిన దౌత్యపరమైన చర్యల

- మిగతా 2లో..

## కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరు..

- ఆయనతో ప్రయోజనం లేదని గజ్వేల్ ప్రజలకు అర్థమైంది
- పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు వచ్చాయన్న సీఎం రేవంత్ రెడ్డి
- కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఒక్క ఎన్నికను కూడా గెలవలేదని విమర్శ
- 2029 ఎన్నికల్లోనూ ఇవే పునరావృతమవుతాయని వ్యాఖ్య

హైదరాబాద్- సూర్య వాస్తవం, డిసెంబర్ 18

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరని, అందుకే ఆయనతో ఎలాంటి ప్రయోజనం లేదని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు ఇచ్చారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని ఆయన అన్నారు. 12 వేలకు పైగా గ్రామ పంచాయతీల్లో 7,500కు పైగా కాంగ్రెస్



విజయం సాధించిందని తెలిపారు. కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్

- మిగతా 2లో..



## ప్యాకేజ్డ్ ఫుడ్‌పై పిల్ కొట్టివేత..

- ఇది పట్టణ ధనికుల భయమంటూ సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్య
- దేశంలో చాలామందికి కనీసం నీళ్లే దొరకవన్న ప్రధాన న్యాయమూర్తి
- డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలు పాటించాలంటూ దాఖలైన పిటిషన్

2లో

## నిధులు లేకున్నా అద్భుతాలు చేయొచ్చు..

- కలెక్టర్ల వినూత్న పథకాలకు సీఎం చంద్రబాబు ఫిదా
- అల్లూరి జిల్లాలో విద్యార్థుల కోసం 'సూపర్ 50' కార్యక్రమం
- పార్వతీపురం మన్యం జిల్లా 'ముస్తాబు'కు సీఎం ప్రశంసలు
- ఏలూరులో నాటుసారా తయారీదారుల కోసం 'ప్రాజెక్టు మార్పు'
- విజయవంతమైన ఈ విధానాలను రాష్ట్రమంతా అమలు చేయాలని ఆదేశం
- వినూత్న ఆలోచనలతో అధికారులు ముందుకొస్తే ప్రోత్సాహం ఉంటుందన్న సీఎం

అమరావతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 18

జిల్లా కలెక్టర్లు తమ పరిధిలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలపై సీఎం చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. అల్లూరి, పార్వతీపురం మన్యం, ఏలూరు జిల్లాల కలెక్టర్లు అమలు చేస్తున్న పథకాలను ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి విజయవంతమైన విధానాలను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ప్రవేశపెట్టిన 'ముస్తాబు' కార్యక్రమం తనను ఎంతగానో ఆకర్షించిందని



ముఖ్యమంత్రి అన్నారు. నిధులు లేకుండానే అద్భుతాలు చేయవచ్చనడానికి ఈ కార్యక్రమమే నిదర్శనమని కొనియాడారు. విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని 79 లక్షల మంది విద్యార్థులకు చేరేలా ప్రభుత్వ,

- మిగతా 2లో..




## సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు..

- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రికి స్టాండింగ్ ఓవేషన్‌తో అభినందనలు
- ఇది దాదాగిరి కాదు, నాయుడుగిరి పాలన అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్య
- ఈ ఘనత అధికారులదేనన్న సీఎం చంద్రబాబు
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి సారించామని వెల్లడి

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## చంద్రబాబు గ్రాఫ్ పడిపోతోందని స్వయంగా ఆయనే చెప్పుకున్నారు

- కోటి సంతకాల ఉద్యమం చారిత్రక విజయం అన్న జగన్
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అతిపెద్ద స్కాం అని ఆరోపణ
- ప్రైవేటుకు కాలేజీలిచ్చి జీతాలు ఎలా ఇస్తారని ప్రభుత్వానికి ప్రశ్న
- కూటమి పాలనలో సంక్షేమ పథకాలు రద్దు చేశారని విమర్శ
- చంద్రబాబు తన తప్పులను కలెక్టర్లపై నెడుతున్నారని వ్యాఖ్య

2లో



# ఉపాధి హామీ చట్టం రద్దు..

**- కొత్త బిల్లుకు లోక్‌సభ ఆమోదం**
**- మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త బిల్లు**
**- 'వీబీ జీ రామ్ జీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం**
**- విపక్షాల తీవ్ర నిరసనల మధ్య మూజువాణి ఓటుతో ఆమోదం**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, డిసెంబర్ 18**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్–గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) పేరుతో రూపొందించిన ఈ బిల్లుపై గురువారం సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పలువురు ఎంపీలు స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. కొందరు ప్రతిపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించి సభలో విసిరేశారు. విపక్షాల ఆందోళనలు, నినాదాల నడుమనే స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. మూజువాణి ఓటుతో బిల్లు నెగ్గినట్లు ప్రకటించారు. ప్రతిపక్షాల నిరసనలతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడటంతో, స్పీకర్ లోక్‌సభను రేపటికి వాయిదా వేశారు. ఈ కొత్త చట్టం ద్వారా గ్రామీణ ఉపాధి వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం...

**- 29వ అంతర్జాతీయ గౌరవం**
**- 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను ప్రదానం చేసిన సుల్తాన్**
**- రెండు రోజుల క్రితం ఇథియోపియా నుంచి కూడా అత్యున్నత గౌరవం**
**- భారత్-ఒమన్ మధ్య కీలక సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం**
**- ఇరు దేశాల 70 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా ఈ పర్యటన**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, డిసెంబర్**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. ఒమన్ పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ గురువారం ప్రదానం చేశారు. గతంలో క్వీన్ ఎలిజబెత్, నెల్సన్ మండేలా వంటి ప్రపంచ ప్రఖ్యాత నేతలకు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. రెండు రోజుల క్రితమే ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీకి ఇది 29వ అంతర్జాతీయ గౌరవం కావడం విశేషం. అంతకుముందు, ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ హైథమ్ మధ్య మస్కట్‌లోని అల్ బరకా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కుదరడాన్ని ఇరువురు నేతలు ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'మైత్రీ పర్వ్' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే, ఇండియా–ఒమన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని, ఒమన్ వ్యాపారవేత్తలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

# రష్యా సైన్యంలో 202 మంది భారతీయులు...

(మొదటి పేజీ తరువాయి)

ఫలితంగా ఇప్పటివరకు 119 మందిని రష్యా సైన్యం నుంచి విడిపించి వెనక్కి తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. మరో 50 మంది భారతీయులు ఇంకా విడుదల కోసం ఎదురుచూస్తున్నారని, వారి భద్రత, సంక్షేమం, వీలైనంత త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తెలిపారు. యుద్ధంలో మరణించిన 26 మందిలో 10 మంది మృతదేహాలను భారత్‌కు తరలించినట్లు ప్రభుత్వం ధృవీకరించింది. మరో ఇద్దరి అంత్యక్రియలు భారత రాయబార కార్యాలయం సహాయంతో రష్యాలోనే స్థానికంగా పూర్తి చేసినట్లు పేర్కొంది. మరణించిన లేదా గల్లంతైన వారిలో కొందరిని గుర్తించేందుకు, 18 మంది భారతీయుల కుటుంబ సభ్యుల డీఎన్ఏ నమూనాలను రష్యా అధికారులతో పంచుకున్నట్లు మంత్రి తెలిపారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం, సైన్యం నుంచి విడుదలైన వారికి ప్రయాణ పత్రాలు, విమాన టిక్కెట్లు, ఇతర లాజిస్టికల్ మద్దతు అందిస్తోందని ప్రభుత్వం తెలిపింది. ఈ అంశాన్ని ఇరు దేశాల నేతలు, మంత్రులు, ఉన్నతాధికారుల మధ్య జరిగిన పలు సమావేశాల్లో ప్రస్తావించినట్లు చెప్పింది. మిగిలిన భారతీయులందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే వరకు తమ ప్రయత్నాలు కొనసాగుతాయని పార్లమెంటుకు హామీ ఇచ్చింది.

# నిధులు లేకున్నా అద్భుతాలు చేయొచ్చు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు. అలాగే ఏలూరు జిల్లాలో నాటుసారా తయారీదారుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కలెక్టర్ వెట్రిసెల్వి అమలు చేస్తున్న 'ప్రాజెక్టు మార్పు' కార్యక్రమాన్ని సీఎం అభినందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 140 గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపించిందని, వారిని మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దుతున్నామని కలెక్టర్ వివరించారు. అల్లూరి జిల్లాలో పదో తరగతి విద్యార్థుల కోసం కలెక్టర్ దినేశ్ కుమార్ అమలు చేస్తున్న 'సూపర్ 50 ఇన్స్పిరేషన్ ఇంజిన్ ఆఫ్ నిర్మాణ్' కార్యక్రమం ద్వారా ఇప్పటికే 90 వేల మంది గిరిజన విద్యార్థులు లబ్ధి పొందారని తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. కుప్పంలో ప్రారంభించిన 'విలువల బడి' కాన్సెప్టును ప్రస్తావిస్తూ, విద్యార్థులకు నాలెడ్జ్‌తో పాటు విలువలు కూడా చాలా ముఖ్యమని సీఎం అన్నారు. టెక్నాలజీని వాడుకుంటూ వినూత్న ఆలోచనలతో ప్రజలకు మేలు చేయాలని, విద్యాశాఖలో మంచి మార్పు తీసుకురావాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు..

**- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రికి స్టాండింగ్ ఓవేషన్‌తో అభినందనలు**
**- ఇది దాదాగిరి కాదు, నాయుడుగిరి పాలన అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్య**
**- ఈ ఘనత అధికారులదేనన్న సీఎం చంద్రబాబు**
**- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి సారించామని వెల్లడి**

**అమరావతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 18**

సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ఎకనామిక్ టైమ్స్' ఈ అవార్డును ప్రకటించిన విషయాన్ని కలెక్టర్ల సదస్సులో మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ ప్రకటన వెలువడగానే సదస్సులోని మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు తమ స్థానాల్లోంచి లేచి నిలబడి (స్టాండింగ్ ఓవేషన్) ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ఈ అవార్డు రావడం గర్వకారణమని అన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... ఈ అవార్డు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని, 'ఎకనామిక్ టైమ్స్' హెడ్డింగ్ చూస్తేనే గూస్‌బంప్స్ వస్తున్నాయని వ్యాఖ్యానించారు. "గతంలో రాష్ట్రం దాదాగిరిని చూసింది, ఇప్పుడు అభివృద్ధి వైపు పరుగులు పెట్టే నాయుడుగిరిని చూస్తోంది" అని అన్నారు. ఇప్పటివరకు కేంద్రంలో ఉన్నవారికే ఈ పురస్కారం దక్కిందని, తొలిసారిగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి లభించడం ఇదే ప్రథమమని వివరించారు. అనంతరం సీఎం చంద్రబాబు స్పందిస్తూ... ఈ ఘనత తనది కాదని, తన సహచరులు, అధికారులు, కలెక్టర్లదేనని అన్నారు. తాను సాధారణంగా అవార్డులు స్వీకరించనని, గతంలో విదేశీ యూనివర్సిటీలు డాక్టరేట్లు ఇస్తామన్నా సున్నితంగా తిరస్కరించానని గుర్తుచేశారు. "గత ప్రభుత్వంలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. ఇప్పుడు గేర్ మార్చి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. 18 నెలల్లో 25 కొత్త పాలసీలు తెచ్చాం" అని తెలిపారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం దేశంలోనే తొలిసారిగా ఎస్క్రో ఖాతాను తీసుకొస్తున్నామని, పాలనలో కూడా 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' అమలు చేయాలని నిర్ణయించామని వెల్లడించారు.

### చంద్రబాబు గ్రాఫ్ పడిపోతోందని

# స్వయంగా ఆయనే చెప్పుకున్నారు

**- కోటి సంతకాల ఉద్యమం చారిత్రక విజయం అన్న జగన్**
**- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అతిపెద్ద స్కాం అని ఆరోపణ**
**- ప్రైవేటుకు కాలేజీలిచ్చి జీతాలు ఎలా ఇస్తారని ప్రభుత్వానికి ప్రశ్న**
**- కూటమి పాలనలో సంక్షేమ పథకాలు రద్దు చేశారని విమర్శ**
**- చంద్రబాబు తన తప్పులను కలెక్టర్లపై నెడుతున్నారని వ్యాఖ్య**

**అమరావతి - సూర్య వాస్తవం, డిసెంబర్ 18**

చంద్రబాబు ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'కోటి సంతకాల ఉద్యమం' చారిత్రక విజయం సాధించిందని, ఇంత పెద్ద సంతకాల ఉద్యమం దేశ చరిత్రలోనే జరగలేదని అన్నారు. ముఖ్యంగా, మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు కట్టబెట్టడం అతిపెద్ద స్కాం అని ఆయన ఆరోపించారు. పార్టీ ముఖ్య నేతలతో ఈరోజు సమావేశమైన ఆయన మాట్లాడుతూ... "ప్రైవేటుకు కాలేజీలు ఇచ్చి, మళ్లీ రూ.120 కోట్ల ప్రజాధనాన్ని జీతాల కింద ఎలా ఇస్తారు? ఇంతకంటే పెద్ద స్కాం ఉంటుందా?" అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉద్యమంలో భాగంగా కోటి 4 లక్షల 11 వేల 136 మంది సంతకాలు చేశారని, ఇది ఒక చరిత్ర అని పేర్కొన్నారు. ఉద్యమాన్ని విజయవంతం చేసిన గ్రామస్థాయి కార్యకర్త నుంచి ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. చంద్రబాబు గ్రాఫ్ పడిపోతోందని స్వయంగా ఆయనే చెప్పుకున్నారని జగన్ వ్యాఖ్యానించారు. కూటమి పాలనలో రెండు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. తమ హయాంలో అమలు చేసిన ఫీజు రీయింబర్స్ మెంట్, రైతు భరోసా వంటి పథకాలను రద్దు చేశారని ఆరోపించారు. ప్రైవేటీకరణ అంటే దోపిడీ అని, విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని జగన్ స్పష్టం చేశారు. తాము ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి బతికించామని, కానీ నేడు అన్ని వ్యవస్థలు తిరోగమనంలో ఉన్నాయని అన్నారు. చంద్రబాబు తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కలెక్టర్లపైకి నెట్టేస్తున్నారని ఆరోపించారు.

# కేసీఆర్ క్రియాశీలక రాజకీయాల్లో లేరు..

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క ఎన్నికను కూడా గెలవలేదని ఆయన విమర్శించారు. హరీశ్ రావు నాయకత్వం మార్చాలని చూస్తున్నారని, అందుకే కేటీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ గురించి ఆలోచించడం లేదని అన్నారు. స్పీకర్ నిర్ణయాలు నచ్చకపోతే కోర్టులు ఉన్నాయని, అక్కడికి వెళ్లవచ్చని సూచించారు. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో మూడు రోజులు చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. 12,702 పంచాయతీలకు 7,527 చోట్ల కాంగ్రెస్, 808 చోట్ల కాంగ్రెస్ రెబల్స్ గెలుపొందారని వెల్లడించారు. 66 శాతం ఫలితాలు కాంగ్రెస్, రెబల్స్ సాధించారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఈ ఎన్నికల్లో ఒక కూటమిగా పోటీ చేస్తే, బీఆర్ఎస్ పార్టీకి 3,511, బీజేపీకి 710 స్థానాలు వచ్చాయని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించినట్లుగా అర్థమైందని అన్నారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికలు జరిగితే 87 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించిందని అన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను తాము పాటిస్తామని, ప్రతిపక్షాలకు మాత్రం ఇంకా అహంకారం తగ్గలేదని విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలు ఈ విజయానికి కారణమని అన్నారు.

# ప్యాకేజ్డ్ ఫుడ్‌పై పిల్ కొట్టివేత..

**- ఇది పట్టణ ధనికుల భయమంటూ సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్య**
**- దేశంలో చాలామందికి కనీసం నీళ్లే దొరకవన్న ప్రధాన న్యాయమూర్తి**
**- డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలు పాటించాలంటూ దాఖలైన పిటిషన్**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, డిసెంబర్ 18**

ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు, తాగునీటిలో ఉండే క్యాన్సర్ కారక రసాయనాల పరిమితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలను అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. ఈ సందర్భంగా ఇది 'పట్టణ ధనికుల భయం' అంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ఫుడ్ ప్యాకేజింగ్ నుంచి వెలువడే యాంటిమొనీ, డీఈహెచ్‌పీ వంటి రసాయనాలపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ నిర్దేశించిన నిబంధనలను పిటిషన్‌లో సవాలు చేశారు. వాటి స్థానంలో డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలను అనుసరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. విచారణ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ.. దేశంలోని వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని పిటిషనర్‌కు సూచించారు. "దేశంలో చాలా ప్రాంతాల్లో ప్రజలకు కనీసం తాగడానికి నీళ్లే దొరకడం లేదు. గాంధీజీ భారతదేశానికి వచ్చినప్పుడు పేద ప్రాంతాల్లో పర్యటించారు. ముందు పిటిషనర్‌ను అలాంటి ప్రాంతాలకు వెళ్లమనండి, అప్పుడు అసలు భారతదేశం అంటే ఏంటో ఆయనకు తెలుస్తుంది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన ప్రమాణాలు చట్టవిరుద్ధమని, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 18 ప్రకారం అంతర్జాతీయ నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలని పిటిషనర్ వాదించారు. యాంటిమొనీ, డీఈహెచ్‌పీ రసాయనాల వల్ల క్యాన్సర్ ముప్పుతో పాటు పురుషుల్లో పునరుత్పత్తి వ్యవస్థపై ప్రభావం పడుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కొత్త ప్రమాణాలను రూపొందించే వరకు డబ్ల్యూహెచ్ఓ నిబంధనలను పాటించాలని, ఈ రసాయనాల వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కూడా కోరారు. అయితే, ఈ వాదనలను తోసిపుచ్చిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

# ఐబొమ్మ రవికి 12 రోజుల కస్టడీ..

- జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు
- నాలుగు కేసుల్లో విచారణకు అనుమతించిన నాంపల్లి కోర్టు
- నేటి నుంచి సైబర్ క్రైమ్ పోలీసుల విచారణ ప్రారంభం
- ఇప్పటికే రెండుసార్లు 8 రోజుల పాటు రవిని ప్రశ్నించిన పోలీసులు

**అమరావతి- సూర్య వాస్తవం, డిసెంబర్ 18**

పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మరోసారి కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి కీలక సమాచారం రాబట్టేందుకు నాంపల్లి కోర్టు రవికి 12 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతినిచ్చింది. ఈరోజు నుంచి పోలీసులు ఆయనను విచారించనున్నారు. రవిపై నమోదైన మొత్తం ఐదు కేసుల్లో.. నాలుగు కేసులకు సంబంధించి ఒక్కో కేసుకు మూడు రోజుల చొప్పున మొత్తం 12 రోజుల పాటు విచారించేందుకు కోర్టు అనుమతినిచ్చింది. ఇప్పటికే ఈ కేసులో రవిని రెండుసార్లు మొత్తం 8 రోజుల పాటు పోలీసులు విచారించారు.

అయితే, కేసు దర్యాప్తులో భాగంగా మరిన్ని కీలక వివరాలు రాబట్టాల్సి ఉందని భావించిన పోలీసులు, మరోసారి కస్టడీకి అనుమతించాలని కోర్టును ఆశ్రయించారు. ఈ తాజా విచారణలో ఐబొమ్మ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని ముఖ్యమైన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# సంపాదకీయం

## కాషాయంగా మారుతున్న అరుణం



కేరళలో భారతీయ జనతా పార్టీ వికసించడం ప్రారంభించింది. భారతీయ జనతా పార్టీకి ఇప్పుడు ఓ సీఎం ఫేస్ కూడా రెడీగా ఉన్నారు . కాకపోతే ఆ ఫేస్ ఇంకా కాంగ్రెస్‌లోనే ఉన్నారు. కానీ బీజేపీతో దగ్గరగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నా లేనట్లేగానే వ్యవహరిస్తున్నారు. ఆయనే శశిథరూర్. రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలంటే.. ముఖ్యంగా ఎదుగుతున్న పార్టీకి ఓ బలమైన నాయకత్వం కావాలి. కేరళలో ఇప్పటి వరకూ అలాంటి నాయకత్వాన్ని బీజేపీ పలుమార్లు టెస్ట్ చేసింది. రాజీవ్ చంద్రశేఖర్, సురేష్ గోపి సహా చాలా మందిని ప్రయత్నించింది. ఏదీ వర్కవుట్ కాలేదు. కానీ శశిథరూర్ మాత్రం అందరి కంటే బెస్ట్ ఆప్షన్ అవుతారుకేరళలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు పాలకవర్గం సిపిఎం నేతృత్వం లోని ఎల్‌డిఎఫ్‌కు, విపక్ష కాంగ్రెస్ సారథ్యంలోని యుడిఎఫ్‌కు గట్టి షాక్ ఇచ్చాయి. చివరకు కేరళ రాజకీయ తెరపై 'కమలం' విరిసింది. రానున్న ఏప్రిల్ మే నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి కూడా అధికారం చేపట్టేలా ఈ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రేరణ కలిగిస్తాయని ఎంతో కలలుగన్న ఎల్‌డిఎఫ్‌కు తీవ్ర ఆశాభంగం తప్పలేదు.

గ్రామ పంచాయతీలు, బ్లాక్ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నేతృత్వం లోని విపక్షానికే చోటు లభించడం అనూహ్య పరిణామం. 14 జిల్లా పంచాయతీల్లో ఒక్కో ఫ్రంట్ చెరి సమాన సంఖ్యలో సీట్లు దక్కించుకున్నాయి. గత రెండు దశాబ్దాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో ప్రజలను ప్రభావితం చేయడంలో పాలకవర్గం ఎల్‌డిఎఫ్ రికార్డు నెలకొల్పినప్పటికీ, ఈసారి దశాబ్ద కాలంగా అధికారంలో లేని యుడిఎఫ్ పైనే ఓటర్లు సానుభూతి చూపించడం ప్రత్యేకంగా గమనించవలసి ఉంది. ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వం మారే 50 ఏళ్ల సంప్రదాయాన్ని 2021 లో ఎల్‌డిఎఫ్ ఛేదించినా, ఈసారి ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువగానే కనిపించింది. శబరిమల అయ్యప్ప క్షేత్రంలోని బంగారు ఆభరణాల చోరీ, ఆలయ యాజమాన్య బోర్డు ప్రెసిడెంట్ అయిన సిపిఎం నాయకుని అరెస్టు, ఆయనపై తదుపరి చర్య తీసుకోవడానికి అధికార పార్టీ సిపిఎం అంగీకరించకపోవడం ఇవన్నీ అయ్యప్ప భక్తులకే కాదు, ప్రజలకు కూడా తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ విషయం లో అలసత్వం చూపిస్తే తీవ్ర పరిణామాలుంటాయని యుడిఎఫ్ హెచ్చరించింది కూడా. ఇక కాంగ్రెస్ నేతృత్వం లోని యుడిఫ్ విషయానికి వస్తే యువజన కాంగ్రెస్ శాసనసభ్యునిపై అత్యాచార కేసులు ఉన్నప్పటికీ, స్థానిక విజయం అసెంబ్లీ ఎన్నికల ముందు యుడిఎఫ్‌ను మరింత బలోపేతం చేసిందని చెప్పవచ్చు. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలున్నాయి. కానీ వాటి గురించి ప్రజలు పట్టించుకోలేదు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వమే ఆ సమస్యను పరిష్కరించుకుంటుందని విడిచిపెట్టి యుడిఎఫ్‌కే పట్టం కట్టారు. దీన్ని గమనించి పార్టీలోని అంతర్గత కుమ్ములాటల చిక్కుముడులను అధిష్ఠాన వర్గం ముందు పరిష్కరించక తప్పదు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారో ఎప్పటికప్పుడు పరిశీలించి, ఆమేరకు స్థానిక నాయకత్వాన్ని పటిష్టపర్చాలి. ప్రజల్లో పార్టీపై నమ్మకం పెంచాలి. ఈ విజయావకాశాన్ని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు తిరిగి ప్రజలు పట్టం కట్టేలా కాంగ్రెస్ నేతృత్వం లోని యుడిఎఫ్ గట్టిగా నిర్మాణాత్మక కృషి సాగిస్తేనే కొంతవరకు నెగ్గుకు రాగలుగుతుంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లో ఘన విజయం సాధించిన ఎన్‌డిఎ కూటమి కార్పొరేషన్ పాలనా పగ్గాలు చేపట్టడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది.. తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో 45 ఏళుగా ఎల్‌డిఎఫ్ పాలనే కొనసాగుతోంది. ఈసారి మొత్తం 101 వార్డుల్లో 50 వార్డులను బిజెపి (ఎన్‌డిఎ) గెల్చుకుంది. ఎల్‌డిఎఫ్‌కు 29 వార్డులు, యుడిఎఫ్‌కు 19 వార్డులు మాత్రమే దక్కాయి. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ఇంకా చాలా కాలం ఉన్నప్పటికీ తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం లోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈసారి గెలుపొందడానికి బిజెపి వ్యూహాలు రూపొందిస్తోంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ ఎల్‌డిఎఫ్ 99, విపక్షం యుడిఎఫ్ 41 స్థానాలు గెల్చుకోగా, త్రిస్సూర్ స్థానాన్ని ఎన్‌డిఎ దక్కించుకుంది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌డిఎ థర్డ్ ఫ్రంట్‌గా అవతరించకుండా ఉంటే స్థానిక సంస్థల విజయాలపై యుడిఎఫ్ మరింత ఉత్సాహంగా ఉండేది. రాష్ట్రంలో ఎక్కువగా ద్విపార్శ్వ సంకీర్ణ పోటీలు జరుగుతున్నాయి. ఈ పార్టీలు ఏ సమయంలో ఎటువైపు మొగ్గు చూపుతాయో చెప్పడం కష్టం. ఈ నేపథ్యంలో మూడవ ఫ్రంట్‌గా ఎన్‌డిఎ కూటమి అవతరించడం మిగతా పార్టీలన్నిటికీ గందరగోళంగా మారే పరిస్థితి ఏర్పడుతుంది. దేశంలోనే ఏకైక వామపక్ష పాలక రాష్ట్రంగా కేవలం తన వ్యక్తిత్వంతో ఆదర్శాన్ని పినరయి విజయన్ ప్రదర్శించారు. ఇప్పుడు ఓటు వాటాల పరంగా వారి ఉనికితో సంబంధం లేకుండా ఎల్‌డిఎఫ్ ఓడిపోవడం వామపక్ష పార్టీలను ఓ మూలకు నెట్టేసినట్టే అవుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి సురేష్ గోపీ త్రిస్సూర్ లోక్‌సభ స్థానం నుంచి 74,686 ఓట్ల మెజార్టీతో చారిత్రాత్మక విజయం సాధించారు. బిజెపి ఏకైక ఎంపీగా నిలిచారు. ఈ విజయం కేరళ రాజకీయాల్లో త్రిముఖ పోటీకి నాంది పలికిందని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి విజయావకాశాలు మెండుగా ఉంటాయని కాషాయ నాథులు అంచనా వేశారు. కానీ లోక్‌సభ ఎన్నికల ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై ఏమాత్రం పడలేదు. కమలనాథుల అంచనాలన్నీ తలకిందులయ్యాయి. 2020 నుంచి త్రిస్సూర్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు బిజెపికి తప్పుడు సంకేతాలనే అందిస్తున్నాయి. ఆనాడు త్రిస్సూర్ అసెంబ్లీలో బిజెపి 6, ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ చెరో 24 స్థానాలను సాధించుకున్నాయి. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో త్రిస్సూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇలాంటి ఫలితాలు రాకూడదని పార్టీలు అనుకుంటున్నాయి. ఏదేమైనా సిపిఎం పట్టు సడలి అరుణ కిరణాలు మసకబారుతున్నాయా? అన్నప్రశ్న ఎదురవుతోంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన విజయాలతో బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో బలంగా పోటీ పడటం ఖాయంగా కనిపిస్తోంది. 2026లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ తన ఓటు బ్యాంకును బీజేపీకి కోల్పోతోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్..స్థానిక ఎన్నికల్లో అత్యధిక విజయాలు సాధించింది. ఇదే ట్రెండ్ కొనసాగితే.. ముక్కోణపు పోటీ జరుగుతుంది. అప్పుడు ముఖ్యమంత్రి అభ్యర్థులే కీలకం అవుతారు. శశిథరూర్ ..బీజేపీ సీఎం ఫేస్ గా నిలబడితే.. అదో అడ్వాంటేజ్ అయ్యే అవకాశాలు ఉంటాయి. మోదీ, షాల రాజకీయాలను .. ఎవరూ తక్కువ అంచనా వేయలేరు.

# ఉపాధి హక్కుకు రాం రాం...!

## - ఉపాధి హామీ చట్టానికి ఊపిరి తీశారు.....!



**అనంతపురం - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను రద్దు చేసి, దాని స్థానంలో వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) లేదా వీబీ- జీ రామ్ జీ బిల్లును ప్రవేశపెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీవ్ర వివాదానికి దారితీసింది. పరిశోధకులు, కార్మిక హక్కుల కార్యకర్తలు గ్రామీణ కార్మిక సంఘాలు ఈ కొత్త బిల్లు గ్రామీణ భారతంలో "ఉపాధి హక్కు"నే క్రమంగా అంతమొందిస్తుందని హెచ్చరిస్తు న్నాయి. 2005లో అమలులోకి వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, వలస సమస్యలకు ప్రతిస్పందనగా రూపొందింది. ఇది సాధారణ సంక్షేమ పథకం కాకుండా, హక్కుల ఆధారిత చట్టం. ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల వేతన ఉపాధిని డిమాండ్ చేసిన వెంటనే కల్పించాల్సిన చట్టబద్ధమైన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 15 రోజుల్లో పని ఇవ్వకపోతే నిరుద్యోగ భత్యం చెల్లించాల్సి ఉండేది. ముఖ్యంగా కూలీ వేతనాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరించడం వల్ల రాష్ట్రాలు నిధుల లేమి కారణంగా చూపి పని నిరాకరించే అవకాశం ఉండేది కాదు. కాలక్రమంలో ఎంజీ నారెగా ప్రపంచంలోనే అతిపెద్ద ఉపాధి పథకాలలో ఒకటిగా మారింది. కరువు, ఆర్థిక మందగమనం, కోవిడ్-19 వంటి సంక్షోభం సమయంలో ఇది గ్రామీణ పేదలకు కీలక ఆధారంగా నిలిచింది. అయితే ఇప్పుడు ప్రతిపాదిత వీబీ- జీ రామ్ జీ బిల్లు ఈ మూల సూత్రాలు మార్చేస్తుందని విమర్శకులు అంటు న్నారు. "ఇది పాత చట్టానికి కొత్త పేరు కాదు, ఇది పూర్తిగా కొత్త చట్టం," ఎంజీనారెగా రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన పౌర సంఘాలు, హక్కుల సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్న, ప్రభుత్వం మూర్ఖంగా ముందుకు వెళుతుంది.

### మహాత్మా గాంధీ పేరు ఉపాధి హామీకి మంగళం

ఎంజీనారెగా ఉపాధి హక్కును హామీ ఇచ్చింది. కొత్త చట్టం ఉపాధి హామీ ఇవ్వడం లేదు. 125 రోజులు అంటున్నది కేవలం కంటితుడుపు మాత్రమే." ఎంజీనారెగా డిమాండ్ ఆధారిత పథకం కాగా, వీబీ-జీ రామ్ జీ బిల్లు పూర్తిగా అలోకేషన్ ఆధారిత విధానంను ప్రవేశపెడుతోంది. బిల్లు సెక్షన్ 4(5) ప్రకారం, ప్రతి ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు ఎంత నిధులు ఇవ్వాలన్నది కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. డిమాండ్ పెరిగితే బడ్జెట్ పెంచే వెసులుబాటు ఇక ఉండదు. కేటాయింపుకు మించి ఖర్చు అయితే అది పూర్తిగా రాష్ట్రాలే భరించాల్సి ఉంటుంది. ఎంజీ నారెగాలో డిమాండ్‌కు అనుగుణంగా నిధులు వచ్చేవి. కొత్త బిల్లులో డిమాండ్ ముందే నిర్ణయించిన బడ్జెట్‌లో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. మరో కీలక మార్పు పథకం వర్తించే ప్రాంతాల విషయంలో కనిపిస్తుంది. ఎంజీనారెగా దేశవ్యాప్తంగా అన్ని గ్రామీణ ప్రాంతాలకు వర్తించేది. కానీ వీబీ- జీ రామ్ జీ బిల్లు సెక్షన్ 5(1) ప్రకారం, కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే ఈ పథకం అమలవుతుంది. నోటిఫికేషన్‌లో లేని ప్రాంతాల ప్రజలకు ఉపాధిపై ఎలాంటి చట్టబద్ధ హక్కు ఉండదు. నిధుల పంపిణీ విధానంలో కూడా పెద్ద మార్పు ప్రతిపాదించారు. ఎంజీనారెగాలో కూలీ వేతనాన్ని 100 శాతం కేంద్ర ప్రభుత్వమే చెల్లించేది. కొత్త బిల్లు ప్రకారం, చాలా రాష్ట్రాల్లో కేంద్రం-రాష్ట్రాల నిధుల నిష్పత్తి 60:40గా ఉంటుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలు తమ వాటా చెల్లించలేక పోతే, పథకమే నిలిచిపోయే ప్రమాదం ఉందని కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. పథకంలో పని దినాలను 100 నుంచి 125కి పెంచుతామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఇది వాస్తవానికి హామీ కాదని విమర్శకులు అంటున్నారు. ఉపాధి లభ్యత కేంద్ర కేటాయింపులు, రాష్ట్రాల ఆర్థిక స్థితి మరియు కేంద్రం నోటిఫై చేసే ప్రాంతాలపై ఆధారపడి ఉంటుంది. పైగా వ్యవసాయ పీక్ సీజన్లలో పని ఉండదన్న నిబంధన మహిళలు, గిరిజనులు వంటి వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. బయోమెట్రిక్ హాజరు, జియో స్పేషల్ మ్యాపింగ్, రియల్‌టైమ్ డిజిటల్ మానిటరింగ్ వంటి సాంకేతిక వ్యవస్థలను తప్పనిసరి చేయడం కూడా మరో వివాదాస్పద అంశం. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక లోపాల వల్ల నిజమైన కార్మికులే బయట పడే ప్రమా దం ఉందని నిపుణులు హెచ్చరి స్తున్నారు. కార్మిక సంఘాలు, పరిశోధకుల దృష్టిలో వీబీ- జీ రామ్ జీ బిల్లు ఒక సంస్కరణ కాదు, హక్కుల ఆధారిత ఉపాధి హామీపై వెనకడుగు. "కోట్లాది కార్మికుల జీవనాధారం మీద ప్రభావం చూపే ఇలాంటి చట్టాన్ని కార్మికులతో, రాష్ట్రాలతో సంప్రదింపులు లేకుండా తీసుకు రావడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం.




పార్లమెంట్‌లో ఈ బిల్లుపై చర్చ ప్రారంభమై చివరికి కేంద్ర ప్రభుత్వం బిల్లు పాస్ అయింది గ్రామీణ పేదలకు ఉపాధి ఒక చట్టబద్ధ హక్కుగా లేకుండా పోయింది. ప్రభుత్వ ఇష్టాధీనంలో ఉన్న ఒక పథకంగా మారి పోతుంది. ఇది ఉపాధి హామీ చట్టానికి ఊపిరి తీసే ఆలోచన. అలాగే జాతిపిత మహాత్మా గాంధీ పేరుకు మంగళం పాడే ఆలోచన ఉందని డా.ముచ్చుకోట. సురేష్ బాబు అభిప్రాయపడ్డారు.

# నేడు గోవా విముక్తి దినం

## -పోర్చుగీసు పాలన నుండి గోవాను విముక్తి చేసిన భారత సాయుధ దళాలు




భారతదేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 19న గోవా విమోచన దినోత్సవాన్ని జరుపుకుంటారు. 450 సంవత్సరాల పోర్చుగీసు పాలన తరువాత 1961లో గోవాను భారత సాయుధ దళాలు విముక్తి చేసిన రోజును ఇది గుర్తు చేస్తుంది. 1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు గోవా ఇంకా పోర్చుగీసు పాలనలో నే ఉంది. పోర్చుగీసు వారు గోవా, ఇతర భారత భూభాగాలపై తమ పట్టును వదులుకోవడానికి నిరాకరించారు. పోర్చుగీసుతో అనేక విఫల చర్చలు మరియు దౌత్య ప్రయత్నాలు తరువాత, భారత మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ, సైనిక జోక్యం ఒక్కటే మార్గంగా నిర్ణయించారు. భారత నౌకాదళ సమాచారం ప్రకారం, భారత దళాలు స్వల్ప ప్రతిఘటనతో డిసెంబర్ 19న గోవా భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. పదవీచ్యుత గవర్నర్-జనరల్ మాన్యుయేల్ ఆంటోనియో వాసాలో ఇ సిల్వా ఈ ప్రాంతంలో పోర్చుగీసు పాలనను అంతమొందించడానికి లొంగుబాటు సర్టిఫికేట్ పై సంతకం చేశారు. దీంతో భారత్ పూర్తిగా పరాయి పాలన నుంచి విముక్తి పొందాడు. "గోవా, డామన్ మరియు డయ్యూ ప్రాంతాల విముక్తి కోసం భారత నౌకాదళం చేపట్టిన "ఆపరేషన్ విజయ్" లో 1961 డిసెంబర్ 19న తమ ప్రాణాలను త్యాగం చేసిన ఏడుగురు యువ నావికులు, ఇతర సిబ్బంది జ్ఞాపకార్థం గోమంతక్ వద్ద యుద్ధ స్మారకం నిర్మించబడింది. గోవా విమోచన దినోత్సవం సందర్భంగా గోవాలో ఘనంగా ఉత్సవాలు, ఉత్సవాలు గోవాలో ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని మూడు వేర్వేరు ప్రాంతాల నుంచి టార్చ్ లైట్ ఊరేగింపు ను వెలిగించారు, చివరికి ఆజాద్ మైదాన్ లో అందరూ సమావేశం అయ్యారు. గోవా ను స్వాధీనం చేసుకోవడంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళి అర్పిస్తారు.

## డాక్టర్ వైద్యనాథ్‌కు ఘన సత్కారం



**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** వేంపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులుగా పని చేస్తున్న వేమవరం వైద్యనాథ్ ను శాలువతో ఘనంగా సత్కరించారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న వేమవరం వైద్యనాథ్ ను ప్రజా సంకల్ప వేదిక అవినీతి నిరోధక వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు రంగ సాయిరెడ్డి ఆదేశాలు మేరకు ప్రకటించడం జరిగింది. ఈమేరకు గురువారం బిఎన్ ఆర్ డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్ర ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు భీమవరం వైద్యనాథ్‌ను శాలువాతో ఘనంగా సత్కారం చేపట్టారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తూ ప్రజల మన్ననలను డాక్టర్ వేమవరం వైద్యనాథ్ పొందడం జరిగిందని చెప్పారు. అలాంటి వ్యక్తి ప్రజా సంకల్ప వేదిక అవినీతి నిరోధక వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించడం సంతోషదాయకమని బిఎన్ ఆర్ డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్ర తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా చేసి ప్రజలకు చైతన్య వంతులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎన్ ఆర్ డ్రైవింగ్ కళాశాల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఇంధన పొదుపు చేద్దాం.. భావితరాలకు వెలుగునిద్దాం

**- డీఈ ప్రసాద్ రెడ్డి**




**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** ఇంధన పొదుపు చేద్దాం భావితరాలకు వెలుగునిద్దాం అని డీఈ ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక డివిజన్ ఆఫీసు నుండి గాంధీ సర్కిల్ ఆవరణ వరకు విద్యుత్ ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఇంధనం పొదుపు చేద్దాం భావితరాలకు వెలుగునిద్దాం అనే ప్రోగ్రాం ద్వారా విద్యుత్తును ఆదా చేసి భావితరాలకు బాటక నిలవాలని అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ గురు మోహన్ రెడ్డి, ఏఈఓ విజయలక్ష్మి, జగదీశ్ రెడ్డి రమేష్ రెడ్డి తదితర లైనింగ్స్ బెటర్లు లైన్మెన్లు విద్యుత్ ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం

**- పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి**



**సింహాద్రిపురం- సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** సింహాద్రిపురం నియోజకవర్గ ప్రజల కష్టాలను తీర్చి, వారికి అండగా ఉండటమే తన ధ్యేయమని టీడీపీ నాయకులు బీటెక్ రవి పేర్కొన్నారు. గురువారం సింహాద్రిపురంలోని తన స్వగృహంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం నుంచి వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను ఓపికగా విన్న ఆయన, అక్కడిక్కడే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు తానూ ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల సమస్యలకు ఎల్లవేళలా తోడుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింహాద్రిపురం మండల టిడిపి నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భూపేష్ రెడ్డి నియామకం పట్ల హర్షం



**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా జమ్మలమడుగుకు చెందిన భూపేష్ రెడ్డికి నియమించడం చాలా హర్షనీయమని టిడిపి యూత్ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. నూతనంగా టిడిపి జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన భూపేష్ రెడ్డిని గురువారం టిడిపి యూత్ నాయకుడు వేణు గోపాల్ రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. 2004 నుండి ప్రత్యక్ష రాజకీయాలలో కొనసాగుతూ అందరి మన్ననలు పొంది జిల్లా అధ్యక్షుడు స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందని చెప్పారు. భూపేష్ రెడ్డి జిల్లా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టి రాజకీయాల్లో తనదైన శైలిలో ముద్ర వేసుకోవడం జరుగుతుందని తెలిపారు. టిడిపి పార్టీ యువతకు అవకాశం ఇవ్వడంతో పార్టీలో మరింత జోస్ పెచ్చేందుకు భూపేష్ రెడ్డి నియామకం ఎంతో పార్టీకి ఉపయోగ పడుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో భూపేష్ రెడ్డి సారధ్యంలో టిడిపి పార్టీ విజయఢంకా మోగిస్తుందని చెప్పారు.

# భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించండి

- ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య
- షిరిడి సాయిబాబా ఆలయంలో ధనుర్మాస పూజలు
- ప్రత్యేక అలంకారంలో సాయినాధుడు



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** పులివెందులలో పార్నపల్లి రోడ్డు నందు మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో ధనుర్మాసని పురస్కరించుకొని గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాధునికి ఉదయం కాగడ హారతి పంచామృతాభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు వాటిలో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ధనుర్మాసంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు.

**ఆలయ అభివృద్ధికి సహకరించండి**

ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య పిలుపునిచ్చారు. సహాయ సహకారాలు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలా పథకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్యలు చేపడతారని, ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి రోజు దాతలకు విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల తరపున నారా లోకేష్‌కి రుణపడి ఉంటా

**- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దాసరి భాను ప్రకాష్**



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** దశాబ్దాల కాలంగా అపరిష్కృ తంగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలకు అత్యంత ఆర్థిక భారంగా తయారైన ఫైర్ సంబంధించిన నిరభ్యంతర సర్టిఫికెట్ విషయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చరిత్రలో నిలిచిపోయే నిర్ణయం తీసుకున్నారని వైయస్సార్ కడప జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దాసరి భాను ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా పాఠశాల బిల్డింగ్ గతంలో అయితే ప్రతి ఏడాది ఫైర్ డిపార్ట్మెంట్ నుంచి మొదటి అంతస్తు వరకు అనుమతి తీసుకోవాల్సి ఉండేది .ఇది చాలామంది నిరుద్యోగ యాజమాన్యాలకు చాలా భారంగా ఉండేది.కానీ గౌరవ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో 30 మీటర్ల ఎత్తు లోపు ఉన్న పాఠశాల భవన నిర్మాణాలకు సంబంధించి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఫైర్ డిపార్ట్మెంట్ నుంచి నిరభ్యంతర సర్టిఫికెట్ తీసుకునే వెసులుబాటు కల్పించారు. ఆ విధంగా మండల స్థాయిలో లేదా నియోజకవర్గస్థాయిలో పాఠశాలలు నిర్మించినటువంటి నిరుద్యోగులకు ఈ నిర్ణయంతో చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.. ప్రైవేట్ విద్యా సంస్థలు ఎదుర్కొన్న ఈ దశాబ్దాల కాలంనాటి సమస్యను ఎంఎల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాటి చిరంజీవి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ రాజశేఖర్, మంత్రి దృష్టికి తీసుకెళ్లటం వారికి ప్రభుత్వ పాఠశాల లతో పాటు ప్రైవేటు పాఠశాలకు కూడా సరైన గుర్తింపు, గౌరవం ఇచ్చినట్లుగా భావిస్తున్నామని భాను ప్రకాష్ తెలిపారు. విద్యాశాఖ మంత్రి తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రైవేట్ విద్యాసంస్థల భవిష్యత్తుకు భరోసా కల్పించినట్లయింది. అతి త్వరలో ప్రైవేట్ విద్యాసంస్థలలోని అన్ని యూనియన్లను సంప్రదించి విద్యాశాఖ మంత్రిని ఎమ్మెల్సీల సహకారంతో కలిసి ఆయనకు ఒక వేదికగా ధన్యవాదాలు చెప్పే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్ట బోతున్నామని గ్రంథాలయ చైర్మన్ దాసరి భాను ప్రకాష్ తెలిపారు.

# దోమల నియంత్రణ - మనందరి బాధ్యత

- సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య
- డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఆశా కార్యకర్తలకు పుస్తకాలు పంపిణీ



**సింహాద్రిపురం -సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** సింహాద్రి పురం, బిదినంచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంల వైద్యాధికారులు డాక్టర్: కుమార్, డాక్టర్: హుస్సేన్ పీర్ ద్వారా ఆశా కార్యకర్తలకు డెంగ్యూ వ్యాధి అవగాహనపై పుస్తకాల



పంపిణీ చేసి, చవ్వవారిపల్లె గ్రామంలో దోమకాటు వల్ల వచ్చు వ్యాధుల గురించి అవగాహన నిర్వహించి, కరపత్రాలు పంపిణి చేయడమైనది. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వృద్ధి అధికంగా ఉంటుంది. అందువల్ల ప్రజలు తమ ఇళ్లలో నిల్వ నీటిని తరచుగా ఖాళీ చేయాలి, నీటి ట్యాంకులకు, తోట్లు, డ్రమ్ములు లకు మూతలు పెట్టాలి అని దోమల కాటునుండి నుండి రక్షణ కొరకు దోమతెరాలు వాడాలి అని, అలాగే, జ్వరం వచ్చినప్పుడు తక్షణం ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు సిద్దయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, పి.హెచ్.ఎన్. పద్మావతి, సూపర్ వైజర్. విజయలక్ష్మి, లక్ష్మీదేవి. సి.హెచ్.ఓ పవిత్ర, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అగ్నిమాపక శాఖ ఎన్‌ఓసి వ్యవధి ఐదు సంవత్సరాలకు పెంచడం హర్షణీయం

**- కడప జిల్లా ప్రయివేటు పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షులు బి ఎస్ రమణారెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** ప్రైవేట్ విద్యాసంస్థలకు అగ్నిమాపక శాఖ ఇచ్చే నిరభ్యంతర పత్ర వ్యవధిని ఒక సంవత్సరం నుండి 5 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎమ్మెస్ నెంబర్ 178 ను విడుదల చేయడం పట్ల కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షులు బిఎస్ రమణారెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. యువ గళం పాదయాత్రలో విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ ప్రైవేట్ విద్యాసంస్థలకు ఇచ్చిన హామీ మేరకు ఈ జీవో విడుదల చేసినందుకు లోకేష్‌కు, జీవో విడుదలకు చొరవ చూపిన శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాజశేఖర్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.



## ఘనంగా జాతీయ కవలల దినోత్సవం

**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** వేంపల్లెలోని విజయ భారతి హై స్కూల్‌లో జాతీయ కవలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ మేడా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 18వ తేదీన కవలల దినోత్స వాన్ని జరుపుకుంటారన్నారు. కవలల దినోత్సవం కవలల ప్రత్యేక అనుబంధాన్ని గౌరవిస్తుందన్నారు. ఈ దినోత్సవం కవలల బంధాన్ని, వారి ప్రత్యేకతను, అందరినీ కలిసికట్టుగా ఆనం దించేలా చేస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా హాజరైన 9 జంట కవలలకు వేంపల్లె అవోపా అధ్యక్షులు బైరిశెట్టి సునీల్ కుమార్, ఉపాధ్యాయులు మార్కయ్య చేతుల మీదుగా మెమెంటో లను అందజేసి వారికి కవలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో యువత ముందుండి

# ఎన్నికల సజావుగా జరిపించాలి

**- యువజన వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన యూత్ నాయకులు**

**- 2029లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిది**



**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 19 :** యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని గురువారం వైకాపా యువజన విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర రవికుమార్, పులివెందుల నియోజకవర్గం బీసీ సంఘ అధ్యక్షుడు చెన్నూరు కార్తీక్, గజ్జల ఆదినారాయణ రెడ్డి, ప్రేమ్ రెడ్డి పుల్లారావులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన పులివెందుల స్థితిగతులను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో యువత ముందుండి ఎన్నికల సజావుగా జరిపించాలని, వైకాపా పార్టీ గెలిపియంగా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. 2029లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నో కుట్రలు పందుతుందని వాటిని యువత సమర్థవంతంగా తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగనన్న 2.0 లో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు.

## మూగజీవుల పశు ఉచిత వైద్య శిబిరం




**తనకల్లు - సూర్య వాస్తవం, డిసంబర్ 18:** మండల పరిధిలోని మల్రెడ్డిపల్లి రైతు సేవ కేంద్రంలో గల ఎర్రబల్లి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువులకు నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులు చికిత్స ఎల్ఎస్‌డి వాక్సినేషన్ చేశారు. డాక్టర్ హరినాథ్ రెడ్డి పర్యవేక్షణలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశుసంవర్ధక సహాయకులు సుధాకర్ నాయక్, జన జాగృతి సంస్థ వారు కిరణ్ కుమార్ రెడ్డి పురుషోత్తమ రెడ్డి, టిడిపి బూత్ కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి సీనియర్ నాయకులు శంకర్ రెడ్డి గ్రామ ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమం మా గ్రామంలో నిర్వహించడం చాలా సంతోషక రంగా ఉందని రైతు సోదరులు తెలియజేశారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** సింహాద్రిపురం మండలంలోని చెర్లోపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలలో బదిలీ అయినా ఉపాధ్యాయులు మధుసూదన్, మిట్ట నాయక్, అశ్వర్ధరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పప్పుగారి రామ్మోహన్ రెడ్డిని గ్రామస్తులు, ప్రస్తుత ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో విద్యాభివృద్ధికి బదిలీ అయిన ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సర్వ సాధారణమన్నారు. అయితే వారి సేవలను గుర్తించి సన్మానించడం వారు విధి నిర్వహణలో చేసిన పని తీరుకు నిదర్శనం అన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామ్మోహన్ రెడ్డి పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ గంగయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మల్లేశ్వర్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం పనింద్రనాథ్, పిఆర్‌టియు నాయకుడు విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.ం



# పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోంది

**ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన గిరిజన కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మేదర రవికుమార్**



**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోందని గిరిజన కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మేదర రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వ కంగా కలిశారు. పలు విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తో చర్చించినట్లు తెలిపారు. పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి అడుగుగా, బీటెక్ రవి ఆధ్వ ర్యంలో జిల్లాలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఎర్రబల్లె చెరువు నింపి, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ కార్యకర్తలకు భరోసా ఇస్తున్నారనే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జడ్పిటిసి ఎన్నికలలో గెలిచి ప్రజలకు బీటెక్ రవి అండగా ఉన్నారని తెలిపారు. ఆయన మంచితనాన్ని గ్రహించిన వైసీపీ నాయకులు వైసిపి కార్యకర్తలు భారీగా ఈ పది రోజుల కాలంలోనే అనేక కుటుంబాలు బీటెక్ రవి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారని అన్నారు. బీటెక్ రవి ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గంలో టిడిపి రెపరెపలాడు తోందని తెలపడం జరిగిందని చెప్పారు.

జిల్లాలో గిరిజనులకు ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని అలాగే గిరిజనులకు అన్ని విధాలుగా త్రాగునీటి,రోడ్డు, నూతన ఇండ్లు ,విద్యా, వైద్యం ఇతర వసతులను కల్పించాలని కోరినట్లు తెలిపారు.తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం మరింత బలపడే దిశగా ముందుకెళ్తున్నామని గిరిజన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మేదర రవికుమార్ తెలిపారు.

# విబి-జి ఆర్‌ఎమ్ జి బిల్లు ప్రతులు దగ్ధం




**మదనపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా విబి-జి ఆర్ఎమ్ జి బిల్లు ప్రతులను వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. గురువారం మదనపల్లె పట్టణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యుయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి ఆర్ఎమ్ జి) పేరుతో ఉపాధిహామీ పథకానికి "రాం.. రాం" పలకనున్నారని పేర్కొన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారని తెలిపారు. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్‌ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చి వేసి అవసరాన్ని (సప్లైని) బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. గ్రామీణ కూలీలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించారని తెలిపారు. పనిదినాలు 100 నుండి 125 రోజు లకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకే నని, ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని పేర్కొన్నారు. మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచారని, ఇప్పటికే యంత్రాలు కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించారని విమర్శించారు. వ్యవసాయ పనుల పేరుతో 60 రోజుల ఉపాధిని సస్పెండ్ చేసి ఈ పథకాన్ని రైతులకు పోటీగా మారుస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు ఇప్పటి వరకు కేంద్రం ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై వేల కోట్ల అదనపు భారం వేస్తున్నా రని తెలిపారు. మన రాష్ట్రంపై ఏటా సుమారు 4వేల కోట్లు అదనపు భారం పడనుందని, ఇప్పటికే లక్షల కోట్లు అప్పుల్లో వున్న రాష్ట్రం ఈ అదనపు భారాన్ని ఎలా భరించగలదని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా వున్న తెలుగు దేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించు కునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరి శర్మ, నారా యణ, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బి.రమేష్ బాబు, మంజునాథ, రమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

**- వీడియో ద్వారా ముఖ్యమంత్రి సందేశాలు**

**కడప - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** కడప జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఐజిజిఏఏ ఆర్ ఎల్ వ్యవసాయ కళాశాల లో వీడియో కన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లా డుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా స్మాట్ కిచన్ ఏర్పాటు చేసి స్కూల్, అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు మధ్యాహ్నం భోజనం లో వాడుకొనే కూరగాయలు ఆకుకూరలు స్మాట్ కిచన్ ద్వారా ఎలాంటి పురుగు మందులు, రసాయణలు లేకుండా పండించిన వాటితో ఫుడ్ పెట్టడం ద్వారా ఇమ్యూనిటీ పెంచి ఆరోగ్యలు మెరుగు పరుచు కోవాలని అన్నారు. అదృష్యాన్ని వీడియో ద్వారా సిబ్బంది కి చూపిస్తూ వారికీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్ వి. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. స్టేట్ నుండి సీనియర్ టిమ్యాటిక్ లీడర్ రామచంద్రం వీడియోకన్ఫరెన్స్ ద్వారా పంటల పైన వచ్చే పురుగులు, తెగుళ్లు వాటి జీవిత చరిత్ర వివరించారు. పురుగు, తెగుళ్ల కు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కాషాయలు, ద్రావణలు ఏవి ఎంత మోతాదులో వాడు కోవాలన్నది క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ట్రైనింగ్ టీం క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.




## పల్స్ పోలియో అమలుపై అవగాహన



**పులివెందుల- సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం లో భాగంగా డిసెంబర్ 21, 22, 23 తేదీలలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమం అమలుపై అవగాహన కల్పించేందుకు గురువారం అర్బన్ పిహెచ్సి, బాకరాపురం నందు సమా వేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రాముడు, మండల అభివృద్ధి అధికారి కృష్ణమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు డా. శాంతి కుమార్, డా. ప్రత్యూష, ఎం పిహెచ్ఈఓ సతీష్ కుమార్, ఎంపిహెచ్ఎస్ కృష్ణవేణి, అంగన్వాడీ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ 0-5 సంవత్సరాల లోపు ప్రతి పిల్లవాడికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని, బూత్ యాక్టివిటీ, హౌస్ టు హౌస్ సర్వే, ట్రాన్సిట్ పాయింట్ల నిర్వహణ పై ప్రత్యేకంగా చర్చించారు. అలాగే ఒక్క పిల్లవాడు కూడా మిస్ కాకుండా చూడ డమే పల్స్ పోలియో కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని అధికారులు తెలిపారు. ప్రజ లందరూ ఈ కార్యక్రమంలో సహకరించి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయిం చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఫెన్సింగ్ పోటీలలో శారద విద్యాసంస్థల

# విద్యార్థికి కాంస్య పతకం

**- జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన కే. జీవన్ సందేశ్**



**విజయవాడ – సూర్యవవాస్తవం ప్రతినిధి, డిసెంబరు 18:** గుంటూరులో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో జరిగిన 69 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ పోటీలలో శారదా విద్యాసంస్థల విద్యార్థి కే .జీవన్ సందేశ్ కు కాంశ్య పతకం లభించింది. దీంతో జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు కే. జీవన్ సందేశ్ ఎంపిక అయ్యాడు. విజయవాడలోని మొగల్రాజపురం లో ఉన్న శారద విద్యాసంస్థల్లో సీనియర్ ఇంటర్ బైపిసి చదువుతున్న కే జీవన్ సందేశ్ కాంస్య పతకాన్ని సాధించటంతో కళాశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శారద విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై. రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై. శారదా దేవి కాంస్య పథకాన్ని సాధించిన కే. జీవన్ సందేశ్ ను అభినం దించారు. తమ విద్యార్థి జీవన్ సందేశ్ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించడం అభినందనీయమని అన్నారు .తన ప్రతిభతో జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక అవ్వటం గర్వకారణ మని పేర్కొన్నారు. క్రీడలు మానసిక, శారీరక బలాన్ని, ధైర్యాన్ని పెంచుతాయని వారు అభిప్రాయపడ్డారు. చదువుతోపాటు ఆటల్లో కూడా విద్యార్థులు ఆసక్తి చూపించాలని, రాష్ట్రస్థాయి లోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా మంచి క్రీడాకారులుగా నిలవాలని వారు కోరారు .కళాశాల అడ్వైజర్ ఈఎస్ఆర్కే ప్రసాద్, కళాశాల జిఎం జి.వి.రావులు మాట్లాడుతూ కాశ్య పతకం సాధించిన జీవన సందేశ్ జాతీయ అంతర్జా తీయ స్థాయిలో ప్రథమ విజేతగా నిలుస్తూ భవిష్యత్తులో ఎన్నో బంగారు పథకాలు సాధించాలని ఆకాం క్షించారు. కళాశాల యాజ మాన్యం గర్వించే విధంగా చదువుతో పాటు క్రీడారంగంలో ఎంతో పేరు ప్రఖ్యాతలతో నిలవాలని వారు అభినందించారు. అంతేకాక ఆటలతో మానసిక, చారీరక ఆహ్లాదకరమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# కమిటీ సభ్యులే పార్టీకి పట్టుగొమ్మలు

**- జరగబోయే ఎన్నికల్లో కమిటీల సత్తా ఏమిటో చాటుదాం**
**- వైసీపీ బలోపేతం చేయడమే మన కర్తవ్యం**
**- 4వ వార్డులో వారి జనసంద్రంలో అనుబంధ విభాగ కమిటీల సమావేశం**



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు, సీయోను పురంలో అనుబంధ విభాగాల కోర్ కమిటీ సమావేశాన్ని పట్టణ ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మాజీ ఛైర్మన్లు చిన్నప్ప, రసూల్,పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, చంద్రమౌళిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమిటీ సభ్యులే పార్టీకి పట్టుకొమ్మలు అన్నారు. జరగబోయే ఎన్నికల్లో కమిటీ సభ్యుల సత్తా ఏమిటో చాటి చూపుదామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఒకటి చెప్పి ఎన్నికల తరువాత వాటిని విస్మరించడం జరుగుతుందన్నారు. వైసీపీ బలోపేతం చేయడం మన కర్తవ్యమన్నారు. 2029లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగనన్న పాలనలో ప్రతి కార్యకర్తకు న్యాయంజరుగుతుందన్నారు.

వైసిపి పట్టణ అనుబంధాల కోర్ కమిటీ సమావేశాలు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యన్నారు. వైయస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జరగబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను వార్డులోని ప్రజలకు వివరించాలన్నారు.

జగనన్న పాలనలో కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు ఉంటుంద న్నారు. పదవులు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్ర మంలో కమిటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ రామకృష్ణ, ఈశ్వరయ్య, గండి, కులయప్ప, పార్నపల్లె కిరణ్, యోహాన్, కుమార్, హరి, నాగరాజు, తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ మైనారిటీ హక్కుల దినోత్సవం

**- మైనార్టీల హక్కుల్ని రక్షిద్దాం....!**
**- ఐఎమ్ఎమ్ వ్యవస్థాపక అధ్యక్షులు మహబూబ్ బాషా**





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** అనంతపురం పట్టణంలోని స్థానిక షహతాజ్ ఉర్దూ స్కూల్ లో మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ మైనారిటీ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించుకు న్నారు. ఈ సందర్బంగా స్కూల్ పిల్లల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఐఎమ్ఎమ్ వ్యవస్థాపక అధ్యక్షులు మహబూబ్ బాషా మాట్లాడుతూ....రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను గౌరవిస్తూ మైనారిటీ ప్రజల హక్కులను పరిరక్షించడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కర్తవ్యము అని వారు తెలిపారు.నాగరికత ఎంత అభివృద్ధి చెందినా, ఇంకా చాలా దేశాల్లో మానవ హక్కులకు, ముఖ్యంగా మైనారిటీల హక్కులకు పూర్తి భరోసా లేని పరిస్థితి ఉందనీ అయన తెలిపారు.భిన్న కులాలు, మతాలు, సముదాయాలకు ఆలవాలమైన మన దేశంలో అన్ని సమాజాల వారికి, ముఖ్యంగా ముస్లిం మైనారిటీలకు హక్కులు, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయా అంటే, సమాధానం కోసం నీళ్ళు నమలాల్సిందేనని ముస్లింల వ్యక్తిగత చట్టాల పరిరక్షణకు హామీ ఉండాలని వక్ఫ్ ఆస్తులను రక్షించాలి. ఉద్యోగ ఉపాధి రంగాలతో పాటు, జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.



## వైసీపీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యులుగా ఎస్ఎండీ ఇస్మాయిల్...!

**కదిరి – సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ సభ్యులుగా కదిరి నియోజక వర్గ వైసీపీ మాజీ సమన్వయకర్త. రాజకీయ ఉద్దాండుడు ఎస్ ఎస్.ఎండి ఇస్మాయిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కదిరి వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, వైసిపి స్టేట్ మున్సిపల్ వింగ్ సెక్రెటరీ లింగాల కృపాకర్ రెడ్డి , కౌన్సిలర్ షాను , కౌన్సిలర్ మహమ్మద్, ఎస్సీ సెల్ స్టేట్ సెక్రెటరీ గంగాధర్, కదిరి నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ రమేష్ యాదవ్, కదిరి టౌన్ వైసీపీ ప్రెసిడెంట్ షేక్ బాబా, మహబూబ్ బాషా, ఏషాన్, జబివుల్లా, సర్పంచ్ ఇర్షాద్, వైసిపి నాయకులు జబివుల్లా, ఇమ్ము, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, వైసిపి పార్టీ నాయకులు మరియు తదితరులు పాల్గొని ఎస్ఎండి ఇస్మాయిల్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.



## ప్రయివేటు విద్యా సంస్థలకు అగ్నిమాపక నిబంధనలపై సడలింపు

**- యువగళం పాదయాత్ర హామీని నెరవేర్చిన మంత్రి లోకేష్**
**- శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి**



**పులివెందుల – సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** యువగళం పాదయాత్రలో ప్రైవేట్ విద్యా సంస్థలకు అగ్నిమాపక నిబంధనపై ఇచ్చిన హామీలో భాగంగా వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో ప్రయివేటు విద్యాసంస్థలను వేధించుటలో భాగంగా అగ్నిమాపక శాఖ నుంచి ప్రతి ఏడాది నిరభ్యంతర పత్రం తీసుకోవాలనే నిబంధనను సడలిస్తూ విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు తీసుకున్న చర్యలు అభినందనీయమని శాసనమండలి సభ్యుల భూమిని రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. వైకాపా హయాంలో అగ్నిమాపక నిబంధనలకు సంబంధించి ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు తీవ్ర ఎదుర్కొన్నారని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర చేస్తున్న సమయంలో ఈ విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చినపుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దీన్ని అయిదు సంవత్సరాలకు పెంచుతామన్న హామీ కి సంబంధించి మండల సభ్యులు విద్యా శాఖ మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకురాగా ఆయన వెంటనే విద్యా, అగ్నిమాపక శాఖల అధికారులకు దీనిపైన చర్యలు తీసుకోమని ఆదేశించారు .ఆ మేరకు ఫైర్ డిపార్టుమెంట్ వారు జీవో విడుదల చేశారు. 30 మీటర్ల ఎత్తువరకు ఉన్న విద్యాసంస్థలకు 5 సంవత్సరాల కొకసారి రెన్యువల్ చేసు కోవా లని ఆ ఉతర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఇటీవలనే గతంలో లోకేష్ హామీ ఇచ్చిన మేరకు పాఠశాలల రెన్యువల్‌ను 10 సంవత్సరాలకు పెంచారు. ప్రయివేటు విద్యాసంస్థలసమస్యలను పరిష్కరిస్తున్న లోకేష్‌కి శాసనమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు .

## వాహనాలు తనిఖీ చేసిన ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి



**లింగాల – సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** లింగాల మండల కేంద్రంలోని పార్న పల్లి బైపాస్ రోడ్లో గురువారం నాడు ఎస్ఐ 'జగదీశ్వర్ రెడ్డి' వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్, నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనదారులు, హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని తెలిపారు. అదే విధంగా ప్రతి టూ వీలర్, ఫోర్ వీలర్, ప్రతి వెహికల్‌కు నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేని ఎడల బండ్లను సీజ్ చేస్తామని, "ఎస్సై జగదీశ్వర్ రెడ్డి' హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్షనర్ల భవనంలో ఘనంగా జాతీయ పెన్షనర్స్ దినోత్సవం




**గుత్తి –సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** గుత్తి పట్టణం పెన్షనర్స్ భవనంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవం ప్రెసిడెంట్ అబుబకర్ అధ్యక్షత ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉప ఖజానా అధికారి సురేష్ బాబు హాజ రయ్యారు. విశిష్ట అతిథులుగా రిటైర్డ్ డాక్టర్ కృష్ణ గోపాల్ రెడ్డి,డాక్టర్ రంగ న్న హాజరయ్యారు. కీ.శే,డి.ఎస్.న కారా చిత్ర పటానికి కోశాధికారి జెన్నే కు ల్లాయిబాబు పూలమాల వేసి నివా ళులర్పించారు.ఈ కార్యక్రమంలో 70 సంవత్సరాలు పూర్తి అయినవారికి ఉప ఖజానా అధికారి చేత సన్మానించారు. సన్మానించిన వారిలో యం.రా మ్ మోహన్,అస్సన్ అహమ్మద్, విజయ భాస్కర్ రెడ్డి, శ్యాం నథానియల్, రాజేంద్ర ప్రసాద్,ఆదినారాయణ, పెన్షన్ భవనంలో పని చేసే అటెండర్ లక్ష్మికు సన్మానించారు.ఈ కార్యక్ర మంలో ప్రెసిడెంట్ అబూబాకర్,సెక్రె టరీ రామ్ మోహన్,అసోషియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ,వైస్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధి కారి జెన్నే కుల్లాయి బాబు, విజయలక్ష్మి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్‌కు ఇస్తున్న విలువ

# మనిషి ప్రాణాలకు ఇవ్వడం లేదు

**- ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**



**కుప్పం - సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** "నా ప్రాణం నాకు విలువైంది" అనే భావనతో ప్రతి ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్ వాడితేనే నిజమైన రోడ్డు భద్రత సాధ్యమ వుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. గురువారం కుప్పం- పలమనేరు జాతీయ రహదారి పై చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు కుప్పం పోలీసు అధికారులు నిర్వహించిన రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లా దుతూ రోడ్డు భద్రత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడూ బాధ్యతగా భావించాలన్నారు. ట్రాఫిక్ నియమాలను, వేగ నియంత్రణను పాటించడం, వాటితో పాటు హెల్మెట్ వాడకం తప్పనిసరి అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా పెట్రోలు బంకుల వద్ద శిరస్త్రాణం లేకపోతే పెట్రోలు నింపకూడదన్న నిబంధనలు జిల్లా పోలీసు అధికారులు ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. ప్రజలు నేడు వేలల్లో కొన్న మొబైల్ ఫోన్‌కు ఇస్తున్న విలువ తమ ప్రాణాలకు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణంలో జరిగే ప్రమాదాలకు అవసరమే ప్రధాన కారణమన్నారు. తమ ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు తమ కుటుంబంలో మనల్ని నమ్ముకుని ఉన్నవారిని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ప్రయాణం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దీనికోసమే ఇటీవల కానిస్టేబుల్ నియామకాల లో 6014 మందిని విధుల్లోకి తీసుకుంటూ వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందించడం గమనించాల్సిన విషయం అన్నారు. పోలీసులు నిత్యం తమ విధులలో ఉంటూ ప్రజలు వారి గమ్యస్థానానికి సురక్షితంగా చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదని విచారం వ్యక్తం చేశారు. అనంతరం కుప్పం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు వైద్యం శాంతారాం, డి.ఎస్.పి బి. పార్థసారథి,కుప్పం రూరల్, అర్బన్ సిఐలు మల్లేష్ యాదవ్, శంకరయ్య,లు పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.




# ప్రజా దర్బార్ సద్వినియోగం చేసుకోవాలి

- మన్నార్ పోలూరు వి.ఎం.ఆర్ నగర్‌లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పర్యటన
- ప్రజా సమస్యలపై సమీక్ష
- తక్షణ చర్యలకు ఆదేశాలు
- టిడ్కో ఇళ్ల హామీతో ఎస్టీ కాలనీలో పర్యటన



**పెళ్లకూరు- సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** సూళ్లూరు పేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ గురువారం సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నార్‌పోలూరు 12వ వార్డు వి.ఎం.ఆర్ నగర్ (ఎస్టీ కాలనీ)లో పర్యటించి స్థానికుల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల లోపాలను ప్రత్యక్షంగా పరిశీలించి, సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యటన సందర్భంగా కాలనీలోని రహదారుల దుస్థితి, వీధి దీపాల నిర్వహణ, త్రాగునీటి సరఫరాలో ఉన్న ఇబ్బందులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని, అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేస్తామని అధికారులతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటామని ఆమె విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. అర్హులైన నిరుపేదలకు టిడ్కో ఇళ్లను త్వరితగతిన మంజూరు చేసి అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమేనని, ముఖ్యంగా ఎస్టీ కాలనీల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే వాటి పరిష్కార బాధ్యత తమదేనని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.





# రైతుల సహకారంతోనే ఎఫ్‌పిఒ అభివృద్ధి






**శాంతిపురం- సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** రైతుల పరస్పర సహాయ సహకారాలతోనే ఎఫ్‌పిఓ అభివృద్ధి చెందు తుందని శాంతిపురం రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (ఎఫ్ పిఓ) ప్రధాన కార్యదర్శి టి.విజయ్ కుమార్ అన్నారు. శాంతిపురం మండల రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఏడవ వార్షిక మహాసభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ పరిధిలో శాంతిపురం మండల రైతు సోదరులందరికీ అందుబాటులో ఉన్న ఎఫ్‌పిఓ ద్వారా అత్యుత్తమ సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రతి రైతు ఆర్థికంగా ఎదగడానికి ఈ సంఘం కృషి చేస్తుందని తెలిపారు. మండల పరిధిలోని 95 ఎఫ్పీఓ గ్రూపుల ద్వారా రైతులకు సంబంధించిన వివిధ పనిముట్లను, పాడి పరిశ్రమకు సంబంధించిన ఉపకరణాలను పశువుల దాణాను, నాణ్యమైన ధరకు అందిస్తూ రైతులు సేవలో నిమగ్నమైందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి కృషితో స్థానిక నేతల సహకారంతో మరింత అభివృద్ధి చెందేందుకు కలిసికట్టుగా పనిచేసి శాంతిపురం మండల ఎఫ్ పిఓను బలోపేతం చేద్దామన్నారు. ఏఎంసి డైరెక్టర్ కె హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్‌పిఓల బలోపేతానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుంద న్నారు. రైతు బాగుంటే రాజ్యం బాగుంటుందన్న నినాదాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా బహిర్గతమైందన్నారు. శాంతిపురం మండల రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం అధ్యక్షు రాలు అమృత మాట్లాడుతూ అధికారులు, నేతల సహకారంతో ఎఫ్పిఓను మరింత బలోపేతం చేయడానికి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్,రైతులు ద్వారా కృషి చేస్తామని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తులను రైతులకు అందించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె చెప్పారు. అనంతరం ఏపీఎం కేఎం శ్రీనివాసులు మాట్లాడుతూ శాంతిపురం మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం పరిధిలో ఉన్న రైతు మిత్ర గ్రూపులను సమన్వయం చేసుకొని వారి అభివృద్ధికి కావాల్సిన నిధులను జిల్లా అధికారులు, ప్రభుత్వ సహకారంతో అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అందుకు బ్యాంకర్లు కూడా సంసిద్ధత వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. రైతులకు సంబం ధించిన ఏ యూనిట్ ద్వారా అయినా రాయితీ ద్వారా రుణాలు అందిం చేందుకు బ్యాంకర్లు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఈ సంఘం వార్షిక నివేదికను, భవిష్యత్ కార్యకలాపాల ప్రణాళికా వివరాలను రైతులు, అధికారులు, సభ్యుల ముందు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ పి ఓ కోశాధికారి నారాయణరెడ్డి మరియు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, అధిక సంఖ్యలో రైతులు, మహిళ పాల్గొన్నారు.




# పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి

**- రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ**

**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** పత్తికొండ నియోజకవర్గం ఆధ్వ ర్యంలో పత్తికొండ పట్టణంలో నాలుగు స్తంభాల కూడలి ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ కార్యాలయంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రామ చంద్రయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్ రాజా సాహెబ్ మండల కార్యదర్శిలు యు.కారుమంచి సుల్తాన్ నాగరాజు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్ రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, సురేంద్ర కుమార్, కృష్ణయ్య, కారన్న పెద్ద వీరన్న, నెట్టకంటయ్య మండల సహాయ కార్యదర్శి గిడ్డయ్య గౌడ్, కాశి పట్టణ సహాయ కార్యదర్శి ఎంకే సుంకన్న, ఏఐటీయూసీ సిపిఐ నాయకులు రంగన్న, ఏఐవైఎఫ్ నాయకులు హనుమేష్, పెద్దయ్య ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి శివ, వివిధ ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

# దేశాభివృద్ధి కోసం విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** సైన్స్ దిన దినానికి ఎంతో అభివృద్ధి చెందుతోందని దేశాభివృద్ధి కోసం గొప్ప శాసనసభ్యులుగా ఎదగాలని ఎంఈఓ చక్రే నాయక్ పేర్కొన్నారు. గురువారం ఏపీ మోడల్ స్కూల్లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని దిన్నెపాడు దేవలంపల్లి జాంద్రపల్లి జెడ్పి ఉన్నత బాలుర బాలికల పాఠశాల లక్కిరెడ్డిపల్లి ఉర్దూ హై స్కూల్ ఏపీ మోడల్ స్కూల్ కేజీబీవీ అంబేద్కర్ గురుకుల పాఠశాలల విద్యార్థులు సుమారు 200 పైగా సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థులు గ్రీన్ ఎనర్జీ కేజీబీవీ విద్యార్థులు షష్టియన్బల్ అగ్రికల్చర్ జాంద్రపల్లి విద్యార్థులు ఎమర్జింగ్ టెక్నాలజీ రిక్రియేషన్ మ్యాథ్స్ ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు హెల్త్ అండ్ హైజిన్ ప్రాజెక్టు ప్రాజెక్టులు తయారు చేశారు. జడ్పీ బాయ్స్ లక్కిరెడ్డిపల్లి విద్యార్థులు వాటర్ మేనేజ్మెంట్ కింద తయారు చేశారు.విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను ఎంఈఓలు ప్రిన్సిపాల్ హెచ్ఎంలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ శాసన సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతుందని సైన్స్ ఎంతో ముందుకు వెళ్తుందని విద్యార్థులు తమ మేధా సంపత్తిని మెరుగు పరచి గొప్ప శాస్త్రవేత్తలు కావాలని ఆయన అన్నారు. ఇక్కడ ఎంపికైన వారు జిల్లా స్థాయిలో లక్కిరెడ్డిపల్లె మండలం నుంచి ఏడు ప్రాజెక్టులు ఎంపిక అయ్యాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 వెంకటసుబ్బయ్య, పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు సూర్యుడు నాయక్, ప్రిన్సిపల్ వరాల రమేష్, వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు రాజశేఖర్ కోమటిరెడ్డి, శివశంకర్ రెడ్డి రాజా షేక్ దావుద్దీన్, బాలరాజు, సురేష్ బాబు, రవీంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ 20వ వార్డును సందర్శించిన కమీషనర్



**గుత్తి - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** గుత్తి మున్సిపాలిటీ 20వ వార్డు డ్రై నేజీ, కాలువల, పరిశుభ్రత, వీధి లైట్లు, వాటర్ సప్లై,శానిటేషన్ పనులు, సందర్శించిన చేసిన కమీషనర్ బి.జ బ్బార్.మియా,డి.ఈ.ఈ హేమచంద్ర, టి.పి.ఓ మారుతి ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బం ది,మున్సిపల్ సిబ్బంది.వార్డు సంద ర్శన కార్యక్రమంలో భాగంగా వార్డు స్థానిక గుంతకల్లు రోడ్డు నుండి అం బెడ్కర్ కాలనీకి వెళ్లే రోడ్డు హెచ్చు, తగ్గు ఉండటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేశారు. సదరు మిషయాన్ని మున్సిపల్ కమీ షనర్ సంబంధిత అధికారులు ప్రజల కు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టి ఆర్.అండ్.బి డిపార్ట్మెంట్ వా రి ద్వారా సదరు సమస్యను పరిష్క రించేందుకు చర్యలు చేపట్టాలని కా లనీ వాసులు విజ్ఞప్తి చేశారు.వార్డు యందు డ్రైనేజీలు,వీధి దీపాలు,ప డిపోయిన ఇండ్ల వలన సమస్యలు వచ్చే పరిస్థితులను వివరయించా రు. ప్రధాన ప్రజలు తిరుగు రోడ్ల యం దు గల మరమ్మత్తులు, పాత శివసా గర్ హొటల్ క్రింద నుండి మురుగు నీరు ప్రవహించే డ్రైనేజీ సమస్యను వివరయించారు. కమీషనర్, మున్సిపల్ అధికారులు సదరు త్వరితగతిన పరిష్కారమయ్యే విజ్ఞప్తులను పరిష్కరించేందుకు చర్యలు చేపడతా మని కమీషనర్ బి. జబ్బార్ మియా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిల్ కాశీనా టిడిపి ఎస్సీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ కృష్ణ గోపాల్ టిడిపి సీనియర్ నాయకులు చిన్న అంజనేయ, రమేష్ బాబు,రవి, లక్ష్మీనారాయణ, భీమలింగ, తిమ్మప్ప, కంబగిరి, టిడిపి నాయకులు, వార్డు వాసులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే చెక్....!

**- ఎమ్మెల్యే కే శ్యాం బాబు చొరవతో ఇకనుండి రోజు మార్చి రోజు తాగునీరు**



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** గతంలో పత్తికొండ పట్టణం తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులను చూసి.... నేడు పత్తికొండ ప్రజల తాగునీటి ఇబ్బంది కలగకుండా రోజు మార్చి రోజు ప్రతి ఇంటికి తాగునీరు వచ్చే విధంగా కూటమి ప్రభుత్వం కొత్తపల్లి రిజర్వాయర్ నుండి 3 కోట్లతో జలజీవన్ మిషన్ కింద పత్తికొండ పట్టణానికి త్రాగునీరు పథకాన్ని ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. పత్తికొండ మండలం కొత్తపల్లి రిజర్వాయర్ దగ్గర నుండి పైప్లైన్ ద్వారా పత్తికొండ పట్టణానికి తాగునీటి నివారణ కోసం 3 కోట్ల రూపాయలతో తాగునీటి పథకాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ



సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ మాట్లాడుతూ పత్తికొండ పట్టణ ప్రజలు ఇబ్బందులు పడకుండా త్రాగునీటి సౌకర్యం కల్పించింది కూటమి ప్రభుత్వం అని తెలియజేశారు. గతంలో 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కొత్తపల్లి దగ్గర ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేసింది.కానీ వాటిని గత ప్రభుత్వం వాటిని మార్చ కుండా కనీసం ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని సర్వీస్ కూడా చేయించకుండా అలాగే నీటిని కొలయాలకుల వది లారు. దానివలన ప్రజలు అనారోగ్యాలకు గురి కావడం జరిగిందన్నారు. అలాగే ఎన్నో ఏళ్ల నుండి ఆయకట్టుని వదిలేసిన రైతులు నేడు ఆయకట్టలను సాగు చేసుకుంటున్నారు. దీనికి కూటమి ప్రభుత్వం చెరువులను నింపడంతో గ్రౌండ్ వాటర్ పెరిగి బోర్ల ద్వారా మరియు చెరువు ఆయకట్టల ద్వారా రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారని అందుకు కూటమి ప్రభుత్వం కృషి అని అన్నారు. అలాగే పత్తికొండ ప్రజలకు త్వరలో కుటుంబంతో ఆహ్లాదకరంగా గడిపేందుకు పార్కులు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము దీపిక,కూటమి నాయకులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి గారూ! నిరుద్యోగ భృతి ఎప్పుడు?

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** నిరుద్యోగ భృతి హామీని ఎప్పటి నుండి అమలు చేస్తారని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ముఖ్యమంత్రిని సూటిగా ప్రశ్నించారు. గురువారం బద్వేల్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు నిరుద్యోగ యువతకు కల్పిస్తామని ,ఉద్యోగం వచ్చినంతవరకు నెలకు 3000 రూపాయలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి పార్టీలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చాయి. సూపర్ సిక్స్ హామీలలో ఇది ప్రధానమైన హామీ. యువత ఈ హామీని నమ్మి కూటమి పార్టీలకు ఓటు వేశారు. గత ఎన్నికల్లో కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చేటందుకు ఇది ప్రధానమైన కారణం. కానీ దురదృష్టవశాత్తు అధికారంలోకి వచ్చి 18 నెలలు అయినప్పటికీ ఇంతవరకు ఈ హామీ అమలు కాలేదు. 3000 రూపాయలు కాదు కదా మూడు పైసలు కూడా ఇవ్వలేదు. ఈ 18 నెలల్లో ఒక్కొక్క నిరుద్యోగికి 54000 రూపాయలచొప్పున ప్రభుత్వం ఎగ్గొట్టింది. నిరుద్యోగిత శాతం ఆంధ్రప్రదేశ్లో ఎక్కువగా ఉండడం సోచనీయం.నిరుద్యోగిత శాతం జాతీయ స్థాయిలో 5.2 శాతం ఉండగా ఆంధ్రప్రదేశ్లో 8.2 శాతంగా ఉండడం గమనార్హం. పురుషుల్లో 7.2శాతం ఉండగా మహిళల్లో 10.1 శాతం ఉంది. మన పొరుగురాష్ట్రాలైన తెలంగాణలో నిరుద్యోగిత శాతం 5.7 శాతం, కర్ణాటకలో 2.8శాతం, తమిళనాడులో 2.8శాతం ,కేరళలో 8 శాతం ఉండగా మన రాష్ట్రంలో 8.2 శాతం ఉంది. యువతను నమ్మించి మోసగించడం భావ్యం కాదు .ఇప్పటికైనా నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ,వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి రూ.3000లు చొప్పున నిరుద్యోగ భృతి అమలు చేయాలని తులసి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రగుడి అచ్యుతరాజు, కాంగ్రెస్ పార్టీ బద్వేలు పట్టణ శాఖ అధ్యక్షులు పగడాల నరసింహులు, బద్వేలు గ్రామీణ మండల శాఖ అధ్యక్షుడు అంబవరం సుధాకర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు బాసు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బండారు వెంకటేశ, చిన్నకోట్ల నాగరాజు, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టమ్స్ ద్వారా

# పోలీసు వ్యవస్థ మరింత పటిష్టం

**- సీసీటీఎన్ఎస్‌పై నిపుణులతో కూడిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన డి.ఎస్.పి మురళి నాయక్**



**పులివెందుల– సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో కడప జిల్లా ఎస్పీ విశ్వనాథ్ ఆదేశాలతో పోలీస్ సిబ్బందికి క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ అండ్ సిస్టమ్స్ ప్రతిష్టాత్మక ప్రణాళికకు సంబంధించి పోలీస్ సిబ్బందికి పులివెందుల డిఎస్పి మురళి నాయక్, రూరల్ సీఐ ఎన్వి రమణ ఆధ్వ ర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లా డుతూ దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్ స్థాయిలో పోలీసింగ్ సామర్థ్యాన్ని, ప్రభావాన్ని పెంపొందించ డానికి సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా సిసిటిఎన్ఎస్ రూపొందించి అమలు చేయడం జరుగుతోందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా పౌరులకు, అద్దెదారులు, గృహ సహాయకులు, డ్రైవర్లు మొదలైన వారి పూర్వ ధ్రువీకరణ సేవలను అందిస్తుందని, తప్పిపోయిన వ్యక్తుల కోసం శోధించడం, ప్రకటిత నేరస్తుల సమాచారం వంటి అందిస్తుందని తెలియ జేశారు. ఈ కార్య క్రమంలో పులివెందుల అర్బన్, రూరల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు సురూర్-ఎ-ఉర్దూ మహోత్సవ్ ర్యాలీ

**- టీడీపీ యువ నాయకుడు మౌర్య రెడ్డిని ఆహ్వానించిన ప్రముఖ మైనార్టీలు**



**రాయచోటి– సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూక్ షిబ్లి ఆదేశాల మేరకు అలవాయి జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని నేడు అంకు రోడ్డు వద్ద ఉన్న పెద్ద కులాయి నుంచి ముఖ్తియార్ చౌక్ వద్ద ఉన్న షాహీ జామియా మసీద్ వరకు సాగే 'సురూర్-ఎ-ఉర్దూ మహోత్సవ్ ర్యాలీ'లో పాల్గొనాలని స్థానిక ముస్లిం మైనార్టీ నేతలు డీలర్ ఆరిఫ్, ఏఎంసి డైరెక్టర్ మస్తాన్,అష్రఫ్ ఇమ్రాన్, బాబ్జి, జేబీయుల్లా మైనారిటీ వెల్ఫేర్ కరీముల్లా కోరుతూ రాష్ట్ర రవాణా, యుజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మేనల్లుడు, టిడిపి యువ నాయకుడు మౌర్య రెడ్డిని గురువారం ఆహ్వానించి అక్కడే ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ ఆహ్వాన పత్రికలో ఉర్దూ రెండో అధికార భాష హోదా 1996, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ కు భూమి కేటాయింపు, డాక్టర్ అబ్దుల్ ఉర్దూ యూనివర్సిటీ కర్నూల్ స్థాపన, 360కు పైగా షాజి ఖానా లు(ఉర్దూగర్ )స్థాపన, స్పెషల్ ఉర్దూ డిఎస్సి ప్రత్యేక ఉర్దూ ఉపాధ్యాయ నియామకాలు, రోషిని పథకం కింద అనేక ఉర్దూ పాఠశాలలు స్థాపన, ఉర్దూ భాష విద్య సాంస్కృతిక అభివృద్ధికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహత్తర సేవల గురించి ఆ ఆహ్వాన పత్రికలో ఆరు శీర్షికల రూపంలో సమాచారాన్ని ముద్రించబడి ఉంది.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

**- డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు**




**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 18:** ప్రాణప్రాయంలో ఉన్న వారిని రక్షించేందుకు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా స్పెషల్ ఆఫీసర్, కడప డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ రెడ్ క్రాస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీంతో కళాశాలలో చదివే విద్యార్థులు రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కల్లా రక్తదానం గొప్పదని చెప్పారు. అత్యవసర పరిస్థితులలో ఉన్న గర్భిణి మహిళాలకు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, రక్తహీనత ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల వారి ప్రాణాన్ని కాపాడిన ప్రాణదాతలు గా నిలుస్తారని చెప్పారు. యూత్ రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ కళాశాల నుండి 25 మంది విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం అనేది సహజ పునరా భివృద్ధికి తోడ్పడు అవుతుందని చెప్పారు. రాబోయే కాలంలో విరివిగా ఇటువంటి కార్యక్రమాల్లో రక్తదాతలు చురుకుగా పాల్గొన్ని సహజ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు పండ్ల రసాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర జిల్లా కోఆర్డినేటర్ పి. సుధాకర్, మెడికల్ ఆఫీసర్ ఎస్రా బేగం, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, డాక్టర్ గంగాధర్, డాక్టర్ నాగలక్ష్మి దేవి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ మాధవరావు, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, టివి అరవింద్, షఫీద్దీన్, రాజారెడ్డి, రేష్మ, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

**- ఈ నెల 21 పల్స్ పోలియో**

**- టాస్క్‌ఫోర్స్ సమావేశంలో అధికారులు**




**వేంపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** ఈ నెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపిడిఓ కుళాయమ్మ సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఓ సభాభవనంలో పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. అలాగే సంబంధిత పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు మండల వ్యాప్తంగా 51 బూత్ లను ఏర్పాటు చేసి, దాదాపు 0-5 వయసు గల 5345 మంది చిన్నారులు ఉన్నారని, వీరందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో తల్లిదండ్రులు, సంరక్షకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వి.సునీత, సూపర్వైజర్లు స్వర్ణలత, సుభద్ర, ఎంఇఓ వెంకట్రామిరెడ్డి, తాళ్లపల్లి పిహెచ్సి డా.నిహారిక, సిహెచ్ఓ వెంకటరత్నం, డిహెచ్ఇఓ షఫి ఉన్నిషా, సిబ్బంది అరుణాదేవి, అంకయ్య, బసయ్య, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బుడిగి రామసుబ్బారెడ్డిని పరామర్శించిన తులసి రెడ్డి



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 18 :** బద్వేల్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు బుడిగి రామసుబ్బారెడ్డి ఇటీవల తిరుపతిలో గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న తులసి రెడ్డి గురువారం బద్వేల్ లో బుడిగి రామసుబ్బారెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బుడిగి రామసుబ్బారెడ్డి త్వరగా మామూలు పరిస్థితికి రావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు అచ్యుత రాజు, పగడాల నరసింహులు, సుధాకర్ రెడ్డి, బాసు, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బండారు వెంకటేశు, చిన్నకోట్ల నాగరాజు, నామా వినయ్ రామ సుబ్బారెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )